మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 5-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 37 Issue: 37

05 ఆగస్టు 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:00 సూర్యాస్తమయం - సా. 6:43 తిథి సప్తమి రా. 8:38 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం అశ్విని రా. 9:14 వరకు తరువాత భరణి యోగం శూల సా. 5:22 వరకు కరణం విష్టి ఉ. 9:24 వరకు బవ రా. 8:38 వరకు వర్జ్యం సా. 5:24 నుండి సా. 6:58 వరకు దుర్ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:57 వరకు యమగండం ఉ. 7:35 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:24 నుండి తె. 5:12 వరకు అమృత ఘడియలు మ. 2:17 నుండి మ. 3:50 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్

ఇన్సూరెన్స్ లేని వాహనాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. వీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ముఖ్యంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించాలని, ఇందుకోసం ఓ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని సూచించింది.


న్యూఢిల్లీ: మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనలను పాటించకపోవడాన్ని ప్రస్తావించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. దేశంలోని రహదారులపై తిరుగుతున్న వాటిలో సగానికిపైగా వాహనాలకు బీమా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. బీమా లేని వాటికి బంకుల్లో ఇంధనం నిరాకరించడం వల్ల రెండు ప్రయోజనాలు ఉంటాయని సుప్రీం కోర్టు పేర్కొంది. బీమా లేని వాహనాలను -2 వ పేజీలో...



## సైబర్ మోసాలపై ఎస్‌వోపీ: సుప్రీం

దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలను అడ్డుకోవడానికి, అక్రమ మ్యూల్ ఖాతాల వినియోగాన్ని చెక్ పెట్టడానికి సుప్రీంకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది.

న్యూఢిల్లీ: సైబర్ ఫ్రాడ్ జరగ్గానే బ్యాంకులు, దర్యాప్తు సంస్థలు తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టంగా వివరిస్తూ.. రాబోయే నాలుగు వారాల్లోగా ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్–ఎస్‌వోపీ) తయారుచేసి తరువాయి 2 వ పేజీలో...



## వాట్స్ అప్.. నీ వయసెంత?

వాట్సాప్‌లో యూజర్లకు 'ఏజ్ ప్రాంప్ట్'

న్యూఢిల్లీ: వాట్సాప్ యాప్ ఓపెన్ చేయగానే ఏజ్, డేట్ ఆఫ్ బర్త్ ధ్రువీకరించాలనే కొత్త ప్రాంప్ట్ కనిపిస్తోంది. ఇలా ఉన్నట్టుండి యూజర్ల వయస్సును ఎందుకు అడుగుతోందోనని వినియోగదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ తరువాయి 2 వ పేజీలో...

# హరీశ్ క్షుద్రపూజలు!

**వర్షాలు పడకుండా చేయిస్తున్నాడు.. నా దగ్గర అన్ని ఆధారాలున్నాయ్**



### తిరుచ్చి, శివమొగ్గలో పర్యటన

### అక్కడ క్షుద్రపూజలున చేసే గుడులు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

### లీగల్ నోటీసులు పంపిన హరీశ్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా, పంటలు పండకుండా, కరువు పరిస్థితులు ఏర్పడాలని హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేయించారని ఆరోపణలు చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. తాను చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 2వ తేదీన తమిళనాడులోని తిరుచ్చి, జూలై 23వ తేదీన కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతాలను హరీశ్‌రావు సందర్శించారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): తిరుచ్చి, శివమొగ్గలో క్షుద్ర పూజలు నిర్వహించే ఆలయాలు ఉన్నాయని.. ఆ పర్యటనలపై హరీశ్‌రావు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు కష్టాల్లో పడాలని, కరువు రావాలని కోరుకుంటూ రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని, కానీ ప్రజలకు నష్టం కలగాలని కోరుకోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పైనా గతంలో ఇలాంటి ప్రచారం జరిగిందని గుర్తు చేసిన మహేశ్ కుమార్ గౌడ్.. ఇప్పుడు హరీశ్‌రావుపై వస్తున్న ఆరోపణలు ఆ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి చేసిన పూజల గురించి కూడా ప్రజలకు వివరించాలని తరువాయి 2 వ పేజీలో...



# మండల కేంద్రాల్లో ప్రజావాణి

### నోడల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో

**ప్రతి సోమవారం మధ్యాహ్నం 1 గంట వరకు**

### రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో (ఎంపీడీవో కార్యాలయం) మండల స్థాయి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశిస్తూ పౌర సంబంధాల శాఖ సమగ్ర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, వేగవంతమైన పరిష్కారమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్, ఎంపీవో, ఎంఏవో, ఎంఈవో, పీహెచ్‌సీ వైద్యాధికారి, సీడీపీవో, సంక్షేమ అధికారులు, విద్యుత్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లు–భవనాలు, అటవీ శాఖలతో పాటు ఇతర అన్ని ముఖ్య శాఖలకు చెందిన దాదాపు 23 రకాల మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా ఈ సమావేశంలో తరువాయి 2 వ పేజీలో...



## టాలీవుడ్ విలన్ ప్రదీప్ రావత్ హఠాన్మరణం

### గుండెపోటుతో తుది శ్వాస

### సినీ ప్రముఖుల తీవ్ర సంతాపం

ముంబై: 'గజినీ' చిత్రంతో పవర్ ఫుల్ ప్రతినాయకుడిగా గుర్తింపు పొందిన నటుడు ప్రదీప్ రావత్ (74) కన్నుమూశారు. మంగళవారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో హఠాన్మరణం చెందారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన, గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచినట్టు తెలిసింది. తెలుగులో 'సై', 'ఛత్రపతి' వంటి చిత్రాల్లో పవర్‌ఫుల్ విలన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించిన -2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,400 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,024 |

## విశ్వవాణి



గర్భిణులకు ప్రసవ ప్రారంభ దశ చాలా కీలకం అని పరిశోధకులు చెప్తున్నారు. గర్భిణులకు సరైన మార్గదర్శనం, మానసిక ధైర్యం, వైద్య సిబ్బందితో నిరంతర సంప్రదింపులు ఉండడం వల్ల వారు భద్రతగా, ఆత్మవిశ్వాసంతో ప్రసవానికి సిద్ధమవుతారని, ప్రసవ ప్రక్రియను ఎదుర్కొనే అవకాశం మెరుగవుతుందని తెలిపారు.




## డాబర్ 'ప్యూర్' కాదు!

### '100% స్వచ్ఛం' తీసేయాల్సిందే

### ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియాకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గట్టి షాక్ ఇచ్చింది. తమ ఉత్పత్తులపై "100 శాతం సహజం", "100 శాతం స్వచ్ఛం", "100 శాతం ఆర్గానిక్" వంటి క్లెయిమ్స్‌లను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది.

న్యూఢిల్లీ: ఈ క్లెయిమ్స్‌లు అస్పష్టంగా ఉంటూ వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందని ఆగస్టు 4న జారీ చేసిన ఉత్తర్వులలో ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. డాబర్ హిమాలయన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్, డాబర్ ఆర్గానిక్ హనీ తరువాయి 2 వ పేజీలో...



## మసాలాలా.. విషాలా?

**హైదరాబాద్‌లో భారీ కల్తీ దందా.. 25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం**

**13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు.. సింథటిక్ రంగులు: సజ్జనార్**

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): హైదరాబాద్‌లో పలుచోట్ల హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలెన్స్ టీం (హెచ్-ఫాస్ట్) తనిఖీలు నిర్వహించగా, కల్తీ మసాలాలు భారీస్థాయిలో పట్టుబడ్డాయి. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి, 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మసాలాల్లో సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్ వాడినట్లు గుర్తించారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదమని తరువాయి 2 వ పేజీలో...



## హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్

### రాష్ట్రంలో ఆగస్టు 10 వరకు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో తరువాయి 2 వ పేజీలో...




## స్వతంత్ర 'బలూచ్'!

**ఆగస్టు 11న ఇండిపెండెన్స్ డే... సార్వభౌమత్వాన్ని గుర్తించాలని ప్రపంచ దేశాలకు వినతి**

ముజఫరాబాద్: పాకిస్థాన్ నుంచి తాము విడిపోయామని ప్రకటించిన బలూచిస్తాన్.. మరో కీలక ప్రకటన చేసింది. ఆగస్ట్ 11వ తేదీని బలూచిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఇక నుంచి తమది స్వతంత్ర దేశమని.. దాని పేరు 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్' అని పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచంలోని అన్ని -2 వ పేజీలో...

## ఇండియన్ ఏజెంట్లు చంపుతున్నరు!



### 30 మంది లష్కరే ఉగ్రవాదుల హతం

### టాప్ కమాండర్ రిజ్వాన్ ప్రకటన

ఉగ్రవాద కార్ఖానాగా మారిన పాకిస్థాన్‌కు, ఆ దేశంలోని ఉగ్రవాదులకు 'గుర్తు తెలియని వ్యక్తులు' గత కొన్నేళ్లుగా చుక్కలు చూపెడుతున్నారు. అజ్ఞాత వ్యక్తులు అకస్మాత్తుగా బైక్ మీద వచ్చి.. దగ్గర్నుంచి గురి చూసి తుపాకీతో కాల్చి అక్కడి నుంచి క్షణాల్లో మాయం అవుతున్నారు. ఇలాంటి అపరిచిత వ్యక్తులు జరిపిన కాల్పుల్లో పాకిస్థాన్‌లోని చాలా మంది ఉగ్రవాదులు, అగ్రశేణి ఉగ్రవాదుల అనుచరులు చనిపోయారు.

ఇస్లామాబాద్: పఠాన్‌కోట్ వైమానిక దళ స్థావరంపై దాడి మాస్టర్ మైండ్ షాహిద్ లతీఫ్.. 2023 అక్టోబర్‌లో సియాల్‌కోట్‌లోని ఓ మసీదులో తెల్లవారుజామున ప్రార్థనలు చేస్తుండగా.. బైక్‌పై వచ్చిన అజ్ఞాత వ్యక్తులు కాల్చి చంపారు. జైషే మహ్మద్‌లోని కీలక ఉగ్రవాది జహూర్ మిస్త్రీ, లష్కరే టెర్రరిస్ట్ రియాజ్ అహ్మద్ తదితరులు ఇలాగే హతం అయ్యారు. పుల్వామా ఉగ్రదాడి మాస్టర్ మైండ్ సైతం ఇలాగే -2 వ పేజీలో...




## 263 'స్పామ్' సంస్థలు బ్లాక్!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న అనవసర వాణిజ్య కాల్స్, సందేశాలపై (యూసీసీ) కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) ఏకంగా 1,83,000 టెలికాం వనరులపై చర్యలు తీసుకున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ మంగళవారం తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

5.8.2026

**మేషం:** చిన్ననాటి మిత్రులతో కారణ కలహా సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. సంతాన విద్యా ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

**వృషభం:** చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఋణదాతల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థికంగా నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

**మిధునం:** సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక వృద్ధి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**కర్కాటకం:** చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తులాభాలు పొందుతారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**సింహం:** ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

**కన్య:** చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

**తుల:** బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనస్సు:** నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబ పెద్దల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

**మకరం:** ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు.

**కుంభం:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థికపరంగా అనుకూలత సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభఫలితాలు పొందుతారు.

**మీనం:** చిన్ననాటి మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున మీ పని తీరుకు అధికారుల నుండి గుర్తింపు పొందుతారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.

# హరీశ్ క్షుద్రపూజలు!

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. అదే సమయంలో.. ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తిన కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌కు లీగల్ నోటీసులు పంపినా తాము వెనక్కి తగ్గేది లేదని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు.

### టీపీసీసీ చీఫ్‌కు లీగల్ నోటీసులు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు లీగల్ నోటీసులు పంపించారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేశారంటూ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు పరువుకు భంగం కలిగించేలా, ఆధారంలేని ఆరోపణలుగా ఉన్నాయని పేర్కొంటూ అడ్వకేట్ ద్వారా నోటీసులు జారీ చేశారు. నోటీసులో మహేశ్ కుమార్ గౌడ్ మీడియా, సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని, ఇటువంటి వ్యాఖ్యలు కాంగ్రెస్ నాయకుల మానసిక స్థితిని ప్రతిబింబిస్తున్నాయని నోటీసులో పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే మహేశ్ కుమార్ గౌడ్‌పై సివిల్, క్రిమినల్ పరువునష్టం దావాలు దాఖలు చేస్తామని హరీశ్ రావు తరఫు న్యాయవాది హెచ్చరించారు.



# ఇండియన్ ఏజెంట్లు చంపుతున్నరు!

మొదటి పేజీ తరువాయి

హతమయ్యాడు. ఐఎస్ఐ నిఘా నీడలో సురక్షితంగా ఉన్నామని అనుకున్న వాళ్లను కూడా ఈ అజ్ఞాత వ్యక్తులు వదల్లేదు. గత మూడు నాలుగేళ్లలో లష్కరే తొయిబా కు చెందిన 30 మందికిపైగా ఉగ్రవాదులు అజ్ఞాత వ్యక్తుల చేతుల్లో హతం అయ్యారు. లష్కరే తొయిబా టాప్ కమాండర్ రిజ్వాన్ హనీఫ్ ఇటీవల బహిరంగంగా ఈ విషయాన్ని చెప్పాడు. రిజ్వాన్ హనీఫ్ మాట్లాడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది మే నెలలో రికార్డ్ అయినట్లు భావిస్తున్నారు. కరాచీ, పెషావర్, రావల్పిండి. రావల్‌కోట్, ముజఫరాబాద్.. ఇలా పాకిస్థాన్‌లోని అనేక నగరాల్లో ఉన్న తమ వాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు టార్గెట్ చేశారని హనీఫ్ చెప్పుకొచ్చాడు. గత 3-4 ఏళ్లలో 30 మందికి 'ప్రజలను' భారత గూఢచార ఏజెంట్లు చంపేశారని ఆరోపించాడు. అజ్ఞాత వ్యక్తుల దాడుల వల్ల పాక్ ఆక్రమిత కశ్మీర్లో లష్కరే ఉగ్రవాదులు శాంతియుతంగా, ప్రశాంతంగా జీవించలేకపోతున్నారని అతడు వాపోయాడు.

# డాబర్ 'ప్యూర్' కాదు!

మొదటి పేజీ తరువాయి

ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి లేకుండానే 'జైవిక్ భారత్' లోగోను ప్రదర్శించడం నిబంధనల ఉల్లంఘన అని అథారిటీ గుర్తించింది. అదేవిధంగా, డాబర్ హోమ్ మేడ్ కోకోనట్ మిల్క్‌పై "100 శాతం స్వచ్ఛత" అనే క్లెయిమ్ వినియోగించడం కూడా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఆయా ఉత్పత్తుల విక్రయాలను వెంటనే నిలిపివేసి, 15 రోజుల్లోగా తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని డాబర్‌ను ఆదేశించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలపై డాబర్ స్పందించింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సమర్పించిన సమాచారంలో తమ ఉత్పత్తుల లేబుల్స్ ప్రస్తుత చట్టపరమైన నిబంధనలకు, పరిశ్రమ పద్ధతులకు అనుగుణంగానే ఉన్నాయని తెలిపింది. తమ ఉత్పత్తుల స్వచ్ఛత, నాణ్యతకు తాము కట్టుబడి ఉన్నామని, వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ఎలాంటి క్లెయిమ్స్ చేయలేదని డాబర్ స్పష్టం చేసింది. ఆహార భద్రతలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని, తదుపరి చర్యల కోసం న్యాయసలహా తీసుకుంటున్నామని వివరించింది.

# వాట్స్ అప్.. నీ వయసెంత?

మొదటి పేజీ తరువాయి

నియమాలకు కట్టుబడేందుకు మెటా సంస్థ ఈ చర్యలు చేపట్టింది. ఈ చట్టం ప్రకారం.. సోషల్ మీడియా, మెసేజింగ్ వేదికలు 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న మైనర్ల డేటాను సేకరించడంపై, వారి లక్ష్యంగా ప్రకటనలు ఇవ్వడంపై ఆంక్షలు ఉంటాయి. అయితే, డీపీడీపీ చట్ట నిబంధనల ప్రకారం, 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు వాట్సాప్, ఇతర మెటా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించాలంటే వారి తల్లిదండ్రులు, సంరక్షకుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేశారు. యూజర్ల వయస్సును స్పష్టంగా తెలుసుకోవడం ద్వారా మాత్రమే మైనర్లను గుర్తించి, వారికి అనుగుణంగా సెక్యూరిటీ, ప్రైవసీ ఫీచర్లను అమలు చేసే అవకాశం ఉంటుంది. అయితే, చాలామంది యూజర్లు తమ డేట్ ఆఫ్ బర్త్‌ను వాట్సాప్‌తో షేర్ చేసుకోవడానికి కాస్త వెనుకడుగు వేస్తున్నారు. వయస్సు వివరాలను కేవలం చట్టపరమైన నిబంధనల కోసమేనని, యూజర్ల వయస్సును నిర్ధారించి డివైడ్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తామని, ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ కారణంగా యూజర్ల వ్యక్తిగత మెసేజ్‌ల భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని 'మెటా' స్పష్టం చేసింది.

# స్వతంత్ర 'బలూచ్'!

మొదటి పేజీ తరువాయి

దేశాల్లో ఉన్న బలూచ్ ప్రజలు ఆగస్ట్ 11వ తేదీని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చింది. అలాగే అంతర్జాతీయ సమాజం తమను స్వతంత్ర, సార్వభౌమ దేశంగా గుర్తించాలని కోరింది. బలూచ్ విముక్తి ఉద్యమ నేత మీర్ యార్ బలూచ్ మాట్లాడుతూ.. ప్రతి బలూచ్ కుటుంబం తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో స్వతంత్ర బలూచిస్తాన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ చారిత్రక దినం ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. 1947 ఆగస్ట్ 11వ తేదీన బ్రిటిష్ పాలన ముగిసే సమయంలో బలూచిస్తాన్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించిందని పేర్కొంది. ఆ ప్రకటనను అప్పటి అంతర్జాతీయ మీడియా, ఆల్ ఇండియా రేడియో కూడా ప్రచురించాయని తమ వాదనలో తెలిపింది. అందుకే ప్రతీ ఏడాది ఆగస్ట్ 11వ తేదీనే తమ స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది.

# 263 'స్పామ్' సంస్థలు బ్లాక్!


మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. నిబంధనలు ఉల్లంఘించిన 263 టెలిమార్కెటింగ్ సంస్థలను (సెండర్స్) బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు స్పష్టం చేసింది. ఈ మూడు నెలల కాలంలో దేశంలోని టెలికాం నెట్‌వర్క్‌లో మొత్తం 73,082 కోట్ల కాల్స్ చోటుచేసుకోగా, వాటిలో 10.85 లక్షల ఫిర్యాదులు స్పామ్ కాల్స్‌కు సంబంధించి నమోదయ్యాయి. అంటే, ప్రతి పది లక్షల కాల్స్‌కు సగటున 1.5 ఫిర్యాదులు అందినట్లు ప్రభుత్వం పేర్కొంది. మొత్తం ఫిర్యాదుల్లో 89 శాతం 'ట్రాయ్'కు చెందిన డీఎన్డీ (డీఎన్‌డీ) యాప్ ద్వారానే వచ్చినట్లు తెలిపింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టేందుకు బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా అవుట్‌గోయింగ్ కాల్స్ నిలిపివేయడం, సిమ్ కార్డులను దీర్ఘకాలికంగా డిస్‌కనెక్ట్ చేయడం, అన్ని ఆపరేటర్ల నెట్‌వర్క్‌లలో సెండర్లను బ్లాక్‌లిస్ట్ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని మంత్రిత్వ శాఖ వివరించింది. టెక్నాలజీ సాయంతో కూడా స్పామ్ కాల్స్‌కు కళ్లెం వేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా సుమారు 2,443 కోట్ల అనుమానిత స్పామ్ కాల్స్, ఎస్సెమ్మెస్‌లను గుర్తించినట్లు వెల్లడించింది. దీనివల్ల వినియోగ దారులు అప్రమత్తమై, ఆ కాల్స్‌ను తిరస్కరించడానికి లేదా జాగ్రత్తగా స్వీకరిం చడానికి అవకాశం కలిగింది. అంతేగాక అనుమానిత సెండర్లకు కేవలం వా రం రోజుల్లోనే 2.43 లక్షల హెచ్చరిక నోటిఫికేషన్లు జారీ చేసినట్లు పేర్కొంది.

# ప్రదీప్ రావత్ హఠాన్మరణం

మొదటి పేజీ తరువాయి

ఆయన మరణవార్తతో సినీ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. ఆయనకు భార్య కల్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నటి రోష్ని అచ్రేజా ప్రదీప్ రావత్ మరణవార్తను ధ్రువీకరించారు. 2008లో వచ్చిన గజినీ చిత్రంలో పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచి, విపరీతమైన కీర్తిని తెచ్చిపెట్టింది. తెలుగు చిత్ర పరిశ్రమలోనూ ప్రదీప్ రావత్ తనదైన ముద్ర వేశారు. సై, ఛత్రపతి, భద్ర, లక్ష్మీ, దేశముదురు, స్టాలిన్ వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల్లో విలన్‌గా నటించారు. ప్రదీప్ రావత్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.



# నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్

మొదటి పేజీ తరువాయి

గుర్తించడం, మరోవైపు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉందా? లేదా? అనే విషయం యజమానులకు తెలియజేయడంలో దోహదపడుతుందని అభిప్రాయపడింది. జాతీయ రహదారులపై భారీ సంఖ్యలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, టోల్ ప్లాజాల వద్ద ఏర్పడుతున్న పొడవైన క్యూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఇటువంటి కారిడార్లలో పైలట్ ప్రాజెక్టులను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.



# సైబర్ మోసాలపై ఎస్వోపీ: సుప్రీం

మొదటి పేజీ తరువాయి

అన్ని బ్యాంకులకు పంపాలని ఆర్బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆర్బీఐకి స్పష్టమైన గడువు విధించింది. మోసపోయిన బాధితులకు వేగంగా ఉపశమనం లభించడమే ఈ నూతన ఎస్వోపీ ముఖ్య ఉద్దేశం. సైబర్ నేరం జరగ్గానే అనుమానాస్పద బ్యాంక్ ఖాతాలను నిమిషాల వ్యవధిలో ఫ్రీజ్ చేయడం, బాధితుల సొమ్మును రికవరీ చేసి తిరిగి అందజేసే ప్రక్రియలను అత్యంత వేగంగా పూర్తి చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ ఎస్వోపీ ప్రతిని అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్లకు అందించాలని ఆర్బీఐని ఆదేశించిన ధర్మాసనం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా ఈ డబ్బు పునరుద్ధరణ మాడ్యూళ్లపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరింది. లేనిపోనీ భయాలతో దోచుకుంటున్న 'డిజిటల్ అరెస్టులను' అడ్డుకోవడానికి, మోసపూరితంగా కాజేసిన సొమ్మును తిరిగి రాబట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఒక అంతర్-విభాగ కమిటీని (ఐడీసీ) ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. ఈ కమిటీ బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించి సమర్థవంతమైన నివారణ చర్యలను అమలు చేయాలి. 'డిజిటల్ అరెస్ట్'ను క్రిమినల్ చట్టంలో కఠినమైన శిక్షలతో కూడిన ప్రత్యేక నేరంగా పరిగణించాలని సూచించిన సుప్రీంకోర్టు, ప్రతి బ్యాంకులో నమోదు చేసిన, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

# మండల కేంద్రాల్లో ప్రజావాణి

మొదటి పేజీ తరువాయి

పాల్గొనాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ప్రజలు చిన్నచిన్న సమస్యలు, భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు లేదా స్థానిక మౌలిక వసతుల దరఖాస్తుల కోసం కలెక్టరేట్లకు వెళ్లాల్సి వచ్చేది. మండల స్థాయిలోనే ఈ వేదిక అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రజలకు ప్రయాణ భారం, సమయం, ఆర్థిక ఖర్చులు తగ్గనున్నాయి. అర్జీల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ లేదా రిజిస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి దరఖాస్తుకు నిర్ణీత కాలపరిమితిలో పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టనున్నారు. తద్వారా జవాబుదారీతనం పెరిగి, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు పారదర్శకంగా అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్

మొదటి పేజీ తరువాయి

45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది. మరోవైపు, గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం, బహదూర్‌పురాలో 5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ వంటి ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉంది. ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆగస్టు 10 వరకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.

# మసాలాలా.. విషాలా?

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలా తయారీ కేంద్రాలపై హెచ్-ఫాస్ట్ మెరుపుదాడులు నిర్వహించింది. దీనిలో భాగంగా 13 మసాలా వ్యాపార, ప్రాసెసింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు చేశామని సీపీ సజ్జనార్ తెలిపారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ జరిగినట్లు గుర్తించామని స్పష్టం చేశారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హానికర పదార్థాలు వినియోగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందని వెల్లడించారు. కొన్ని ఆహార పదార్థాల్లో హెయిర్




కలర్ కూడా కలుపుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. మసాలాలకు మెరుపు, రంగు, బరువు పెంచేందుకు ప్రమాదకర రసాయనాలు ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తుల్లా విక్రయిస్తున్నారని చెప్పారు. మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న 89 టన్నులకు పైగా ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామన్నారు. ఆహార భద్రత చట్టం కింద నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాలపై పోలీసులకు లేదా హెచ్-ఫాస్ట్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కల్తీ ఆహారంపై హెచ్-ఫాస్ట్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 61212కు కాల్ చేయాలని సూచించారు.

# అన్ని సర్కారీ ఆఫీసులకు టీ-ఫైబర్

## సెప్టెంబర్ 1 నుంచి ప్రైవేట్ ఇంటర్నెట్ బంద్.. రూ.400 కోట్ల ఆదా లక్ష్యం: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలకు పూర్తిగా స్వస్తి పలుకుతూ, సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కేవలం "టీ-ఫైబర్" ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా కావడంతో పాటు, డేటా భద్రత కూడా మరింత బలోపేతం కానుంది. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంగళవారం




నిర్వహించిన టీ-ఫైబర్ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ కార్యాలయం కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు బిల్లులు చెల్లించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4,487 ప్రభుత్వ కార్యాలయాలను టీ-ఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ చర్య వల్ల గత ఆరు నెలల్లోనే ప్రభుత్వానికి సుమారు రూ.13 కోట్ల మేర ఖర్చు ఆదా అయిందన్నారు. మిగిలిన కార్యాలయాలను కూడా త్వరితగతిన టీ-ఫైబర్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టీ-ఫైబర్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర డేటా సెంటర్‌తో నేరుగా అనుసంధానం చేయడం వల్ల సురక్షితమైన ఇంట్రానెట్ వ్యవస్థ ఏర్పడి, ప్రభుత్వ సమాచారానికి అత్యున్నత స్థాయి భద్రత లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్‌లో సైబర్ భద్రతకు ఇది కీలకంగా మారుతుందన్నారు. తెలంగాణ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టీ-స్వాన్)ను కూడా నెల రోజుల్లో పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న "భారత్ ఫ్యూచర్ సిటీ"కి అత్యాధునిక ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా, ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ లక్ష్యంతో ప్రిన్సిపల్ మానిటైజేషన్ పార్ట్నర్ ఎంపిక కోసం టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. డిజిటల్ తెలంగాణ నిర్మాణంలో టీ-ఫైబర్ కీలక మైలురాయిగా మారనున్న నేపథ్యంలో, ప్రభుత్వ వ్యయ నియంత్రణతో పాటు ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన డిజిటల్ సేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ నిర్ణయం నిదర్శనంగా నిలుస్తోంది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



## మల్యాల విద్యార్థుల మృతిపై ధర్మ సమాజ్ పార్టీ సంతాపం

జగిత్యాల, ఆగస్టు 4 (ఈవార్తలు): మల్యాల మండలంలోని ఇంటిగ్రేటెడ్ బీసీ బాలుర హాస్టల్‌లో ఉంటూ స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కుంటలో మునిగి మృతి చెందిన ఘటనపై ధర్మ సమాజ్ పార్టీ జగిత్యాల జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాక శివ మహారాజ్ మాట్లాడుతూ, చిన్నారుల మృతి అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, తక్షణమే తగిన ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి అరుణ్ నేత, ప్రధాన కార్యదర్శి సుంకపాక కొటేష్, నాయకులు ఉపేంద్ర, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈహెచ్‌ఎస్‌తో అధునాతన కంటి వైద్యం

**జగిత్యాల జేఎంహెచ్‌లో ప్రత్యేక వైద్య సేవలు**



జగిత్యాల, ఆగస్టు 4 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయ్‌మెంట్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) కింద జగిత్యాల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలకు అధునాతన పరికరాలతో చికిత్స, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో నేత్ర వైద్య శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ ఎండీ ముదస్సిర్ ఉద్దీన్ ఆధ్వర్యంలో కంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ముత్యపు కంటి శస్త్రచికిత్సలను ఆధునిక 2.8 ఎంఎం ఎంఐసీఎస్ విధానంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్ ఫాకో మెషీన్, జర్మనీ మైక్రోస్కోప్ వంటి అధునాతన పరికరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ అనంతరం తక్కువ సమయంలోనే డిశ్చార్జి చేసే సదుపాయం ఉందని, హార్ట్, షుగర్ సమస్యలు ఉన్న రోగులకు కూడా సురక్షితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోగులకు ఏసీ గదులు, అవసరమైన మందులు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈహెచ్‌ఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు ఈ ప్రత్యేక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి నిర్వాహకులు కోరారు.

## చాందీపురా వైరస్‌తో 22 మంది మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌లో చాందీపురా వైరస్ మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ఈ వర్షాకాలంలో ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. గుజరాత్ రాష్ట్ర ఆరోగ్య మంత్రి ప్రఫుల్ పాన్షేరియా వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 184 అనుమానిత కేసులు నమోదు అయ్యాయి. వీటిలో 35 నమూనాలు పాజిటివ్‌గా తేలగా.. మరో 11 నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉన్నట్లు తెలిపారు. వైరస్ బారిన పడిన వారందరూ 15 ఏళ్లలోపు పిల్లలే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం గాంధీనగర్, హిమత్‌నగర్, పటాన్, రాజ్‌కోట్, భావ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడుగురు చిన్నారులు ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని అధికారులు వెల్లడించారు. మరో ఆరుగురు కోలుకుని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ చాందీపురా వైరస్ కేసులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నమోదు అవుతున్నాయని.. ఏ ఒక్క జిల్లా లేదా గ్రామానికే పరిమితం కాలేదని తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్జిత సేవలు రద్దు

తిరుమల, ఆగస్టు 4 (ఈవార్తలు): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు తిరుమలలో అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. టీటీడీ ప్రకటన ప్రకారం, బ్రహ్మోత్సవాల సమయంలో అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ వంటి ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేయనున్నారు. వీటితో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్‌ఆర్‌ఐలు, దాతలకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేశారు. ఈ మార్పులను భక్తులందరూ గమనించి, టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అత్యధిక దర్శన సమయం కేటాయించేందుకు టీటీడీ ఈ చర్యలు చేపట్టింది. ఈ తొమ్మిది రోజుల పాటు స్వామివారి వాహన సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం అధికారిక ప్రకటన జారీ చేసింది.

## పుట్టినా, గిట్టినా వెంటనే చెప్పాలె!

**ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు**

**రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం**

**కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం**



న్యూఢిల్లీ: దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## వాషింగ్టన్.. బూడిద!

**2.5 లక్షల ఎకరాలు అగ్నికి ఆహుతి**

**కాలిపోయిన వందలాది ఇళ్లు**

**సురక్షిత ప్రాంతాలకు 65,000 మంది**



స్పోకేన్: అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రం కార్చిచ్చుల ధాటికి వణికిపోతోంది. తూర్పు వాషింగ్టన్‌లోని స్పోకేన్ నగరం, దాని పరిసర ప్రాంతాల్లో మంటలు వేగంగా వ్యాపిస్తుండటంతో సుమారు 65,000 మందికి పైగా నివాసితులు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈ విపత్తులో వందలాది ఇళ్లు, ఇతర కట్టడాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక కార్చిచ్చుకు కారణమయ్యాడనే ఆరోపణలతో 37 ఏళ్ల వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. స్పోకేన్ నగరం సమీపంలో చెలరేగిన మూడు ప్రధాన కార్చిచ్చులు ఇంకా అదుపులోకి రాలేదని అధికారులు వెల్లడించారు. తమ ప్రాంతం ఎదుర్కొన్న అత్యంత భయంకరమైన ప్రకృతి విపత్తు ఇదేనని స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ బీబీసీకి తెలిపారు. ప్రాణనష్టంపై ఆరా తీస్తున్నామని, ఆస్తి నష్టాన్ని సమీక్షిస్తున్నామని వివరించారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 700కు పైగా నిర్మాణాలు కాలిబూడిదయ్యాయని అమెరికన్ రెడ్ క్రాస్ ప్రాథమికంగా నిర్ధారించింది. 'ఓల్డ్ ట్రెయిల్స్ ఫైర్' ఘటనకు సంబంధించి ఆరోన్ ఎఫ్. ఫారినాకి (37) అనే వ్యక్తిని ఫస్ట్-డిగ్రీ ఆరోపణల కింద అరెస్ట్ చేసినట్లు స్పోకేన్ కౌంటీ షెరీఫ్ జాన్ నోవెల్స్ వెల్లడించారు. నిందితుడిని 1 మిలియన్ డాలర్ల బాండ్‌పై అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వారాంతంలో చెలరేగిన మంటల వల్ల సర్వం కోల్పోయిన కొందరు బాధితులు సోమవారం తమ ఇళ్లకు చేరుకుని, అక్కడ మిగిలిన కాలిపోయిన శిథిలాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. "ఇక్కడ కాపాడుకోవడానికి ఏమీ మిగల్లేదు" అని 76 ఏళ్ల మిరియం సిమ్ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పోకేన్ కౌంటీలో శనివారం ప్రారంభమైన మంటలు దాదాపు 8,026 ఎకరాలకు పైగా విస్తరించాయి. వాతావరణం కొంత అనుకూలించడంతో మంటలను అదుపు చేసే ప్రక్రియలో పురోగతి కనిపిస్తోందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అయినప్పటికీ, ప్రధాన కార్చిచ్చులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని వారు స్పష్టం చేశారు.

## రెండున్నరేళ్లలోనే ఏపీకి రూ.19,619 కోట్లు

**లోక్‌సభలో కేంద్రం వెల్లడి**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి.

## నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్: జగ్గారెడ్డి



మెదక్, ఆగస్టు 4 (ఈవార్తలు): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు.

## సొంతంగా నామినేషన్ పత్రాలు నింపుతవా?

**సీఎం రేవంత్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్**

నిజామాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## పేదలను భయపెట్టేందుకే హైడ్రా

**హిట్లర్ ఆదర్శంతోనే ఆ సంస్థ ఏర్పాటు**

**బీజేపీ ఎంపీ ఈటల ధ్వజం**

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): 'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

# రుద్రంగిలో 45 కోట్ల ఏటీసీ

## భూమిపూజ చేసిన మంత్రి వివేక్.. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలే లక్ష్యమని వెల్లడి

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 4 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులకు కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్ ఐఏఎస్ ఏ. నిర్మల క్రాంతి వెస్లీతో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ.4,000 కోట్లతో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐటీఐలను ఆధునీకరిస్తూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక నైపుణ్యాలను అందిస్తున్నామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని తెలిపారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విదేశీ భాషల శిక్షణ కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. రుద్రంగిలో జర్మన్ భాషా శిక్షకుడిని నియమించి 100 మంది యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటీసీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడతామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రుద్రంగి ప్రాంతంలో విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని, ఇందులో 2,500 మంది విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, మూలవాగుపై రెండో వంతెన నిర్మాణం తుది దశకు చేరుకుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రుద్రంగి ఏటీసీలో 288 మంది విద్యార్థులకు ఏడు ఆధునిక



కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. మర్రిపల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం, ఆధునిక గోశాల కోసం చెరో 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటీసీల్లో ఏఐ, డ్రోన్ టెక్నాలజీతో పాటు ఏడు ఆధునిక కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా ఈ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకుల తిరుపతి, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద్ రెడ్డి, ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, సర్పంచ్ గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు రాకముందే పోస్టుమార్టమా?

**మృతదేహాలను స్వీకరించబోం**

**మల్యాల విద్యార్థుల మృతి ఘటనపై కుటుంబ సభ్యుల ఆగ్రహం**


**మంత్రి స్వయంగా వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్**

జగిత్యాల, ఆగస్టు 4 (ఈవార్తలు): జిల్లాలోని మల్యాల ఎస్సీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతి ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మృతిచెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులు జగిత్యాల టీఆర్ నగర్‌లో ధర్నాకు దిగారు. తమకు సమాచారం ఇవ్వకుండానే, తల్లిదండ్రులు వచ్చేలోపే పోస్టుమార్టం నిర్వహించారని వారు ఆరోపించారు. అంతేకాకుండా రాత్రికి రాత్రే మృతదేహాలను తరలించేందుకు అధికారులు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి విడుదల చేసిన వీడియో ప్రకటనపై తమకు సంతృప్తి లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మంత్రి స్వయంగా ఘటనాస్థలికి వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించి, స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు మృతదేహాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. దీంతో టీఆర్ నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులతో అధికారులు, పోలీసులు చర్చలు జరుపుతూ వారిని శాంతింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కూలిన ఇళ్లకు 1.20 లక్షల సాయం

**అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

సారంగాపూర్, ఆగస్టు 4 (ఈవార్తలు): భారీ వర్షాలకు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన పస్తం పరమేశ్, స్వప్నల ఇళ్లు కూలిపోవడంతో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ వాటిని పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాల కింద ప్రభుత్వం నుంచి రూ.1.20 లక్షల నష్టపరిహారం మంజూరు చేయిస్తామని, ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు, గ్రామ నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడిసెలు, పూర్తిగా కూలిపోయిన ఇళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రేకులతో నివసిస్తున్న అర్హులకు స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. తొలి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వహీద్, ఎంపీడీవో నీరజ, ఎంపీవో సలీం, సర్పంచ్ రాధారాజు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

హైదరాబాద్, ఆగస్టు 4 (ఈవార్తలు): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం) ప్రాంగణంలోని దుర్గాదేవి ఆలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని బోనాల వేడుకలను ప్రారంభించి ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాస్ రావు, ముజీబ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎం. సత్యనారాయణగౌడ్, రాసూరి జ్ఞానేశ్వర్, బంగ్లా సుశీల్, ఎం.శ్రీనివాస్ రావు, నవీన్ కుమార్, శ్రీకాంత్, మహేష్, ప్రదీప్, సంతోష్, నరేష్, ప్రశాంత్, డి.ప్రభాకర్, కన్నె రమేష్ యాదవ్, బల్వీర్, డాక్టర్ విజయశాంతి, డాక్టర్ ఉమా, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సాయితేజ, జగన్మోహన్ మోహన్ రావు, డాక్టర్ రమా, శైలజ, ముకరాల చంద్రశేఖర్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, డాక్టర్ అయోషా, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సబిత, డాక్టర్ దివ్యకీర్తి, డాక్టర్ కలీల్, తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాది హత్యకు నిరసనగా విధులు బహిష్కరణ

**దుండగులను కఠినంగా శిక్షించాలి: పిట్టల మనోహర్**

వేములవాడ అర్బన్, ఆగస్టు 4 (ఈవార్తలు): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన న్యాయవాది మల్లయ్యను దుండగులు దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిట్టల మనోహర్ నాయకత్వంలో న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ, న్యాయవాది మల్లయ్య హత్య కేసును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులపై దాడులు, హత్యలు సమాజానికి ప్రమాదకర సంకేతాలని పేర్కొన్న ఆయన, న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొత్తూరు అనిల్‌కుమార్, గుండ రవి, పెంట రాజు, న్యాయవాదులు రేగుల దేవేందర్, పర్లపెల్లి అంజయ్య, నక్క దివాకర్, మాదాసు దేవయ్య, జెట్టి శేఖర్, కనికరపు శ్రీనివాస్, గుజ్జె మనోహర్, నేదూరి అభిలాష్, బీమా మహేష్‌బాబు, ఒద్యారపు వేణుకుమార్, వడ్లకొండ శ్రీకాంత్, పొత్తూరు మల్లేశం, వంగ పర్శరాములు, గోపు మధు తదితరులు పాల్గొన్నారు.

# నేరస్థుల అప్పగింతలో సహకారం ఉండాలి

**బ్రిక్స్ దేశాలు సమిష్టిగా పనిచేయాలి: డీవోపీటీ కార్యదర్శి**

**బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం ప్రారంభం**




హైదరాబాద్, ఆగస్టు 4 (పీఐబీ): నేరస్థుల అప్పగింతలో బ్రిక్స్ దేశాలు సమిష్టిగా పనిచేయాలని భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా అన్నారు. బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ రెండు రోజుల సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆగస్టు 4, 5 తేదీల్లో జరుగుతున్న ఈ సమావేశంతో పాటు ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశం కూడా నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి అవినీతి ప్రధాన అవరోధమని, ఇది ప్రజా వనరులను దారి మళ్లించడమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆమె పేర్కొన్నారు. అవినీతి సమస్యను ఏ దేశమూ ఒంటరిగా ఎదుర్కోలేదని, అక్రమ ఆర్థిక లావాదేవీలను అరికట్టడం, ప్రజా వనరులను పరిరక్షించడం, అంతర్జాతీయ అవినీతి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడం కోసం అన్ని దేశాలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సరిహద్దులు దాటి పారిపోయే ఆర్థిక నేరస్తుల సమస్యను ప్రస్తావించిన రచనా షా, పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడం, వారి అప్పగింతకు సహకరించడం, అక్రమంగా సంపాదించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో బ్రిక్స్ దేశాల మధ్య మరింత సమన్వయం అవసరమని పిలుపునిచ్చారు. నేరస్తులకు ఏ దేశమూ ఆశ్రయంగా మారకూడదని స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలతో పరారీలో ఉన్న నిందితుల వివరాల కోసం ఏర్పాటు చేసిన బ్రిక్స్ అనధికారిక సహకార భాండాగారం, అలాగే బ్రిక్స్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్ పురోగతిని ఆమె స్వాగతించారు. సభ్య దేశాలు స్పష్టమైన ఫలితాల దిశగా కలిసి పనిచేయాలని కోరారు. అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న రచనా షా, సమాచార మార్పిడి కోసం రూపొందించిన ప్రామాణిక విధానాలు, నోడల్ పాయింట్లు, నిపుణుల డైరెక్టరీ చట్ట అమలు సంస్థల మధ్య వేగవంతమైన సహకారానికి దోహదపడతాయని తెలిపారు. అవినీతి నిరోధంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఆమె, డిజిటల్ గుర్తింపు, ఈ-సేవలు, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలు, డేటా ఆధారిత పర్యవేక్షణ వంటి సంస్కరణలు అవినీతిని అరికట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని వివరించారు. భారత్‌లో గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్, ప్రత్యక్ష నగదు బదిలీ, ముఖరహిత, కాగితరహిత పన్ను విధానం వంటి కార్యక్రమాలు సాంకేతికత ఆధారిత పారదర్శక పరిపాలనకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో "నవకల్పనలు, సాంకేతికత ఆధారిత వ్యవస్థల ద్వారా నైతిక పరిపాలన" అంశంపై ప్రత్యేక చర్చలు నిర్వహిస్తూ, సభ్య దేశాలు తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకుంటున్నాయి.

# అక్రమ మట్టి తవ్వకాలే విద్యార్థుల మృతికి కారణం

**విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**

**మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



మల్యాల, ఆగస్టు 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల బీసీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు కుంటలో మునిగి మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మల్యాలలో ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ వెనుక ఉన్న కుంట సహజంగా ఏర్పడింది కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తాను ఆరోపిస్తున్న అక్రమ మట్టి తవ్వకాల వల్ల భారీ గుంత ఏర్పడి, వర్షపు నీరు చేరడంతో ప్రమాదకర కుంటగా మారిందని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వారితో పాటు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వెనుక ప్రమాదకర ప్రాంతం ఉన్నప్పటికీ కంచె ఏర్పాటు చేయకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, విద్యార్థుల భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. రాష్ట్రంలోని గురుకులాలు, వసతి గృహాలు, హాస్టళ్లలో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. వరుస ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు అవసరమైన ఇతర సహాయాన్ని వెంటనే అందించాలని కోరారు. అక్రమ మట్టి తవ్వకాలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, సంబంధిత వ్యక్తులు, అధికారుల పాత్ర తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోతే బీఆర్ఎస్ పార్టీ వారి తరఫున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు.



# బీజేపీ పోరాటంతోనే ధాన్యం బకాయిల విడుదల: వికాస్‌రావు

వేములవాడ అర్బన్, ఆగస్టు 4 (ఈవార్తలు): రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు వేములవాడ రూరల్ మండల రైతుల ఖాతాల్లో జమ కావడంతో బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. నూకలమర్రి, మరిపల్లి, మల్లారం గ్రామాలకు చెందిన 58 మంది రైతులకు సంబంధించిన సుమారు రూ.52 లక్షల ధాన్యం చెల్లింపులు ట్రక్‌షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో నిలిచిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాసరావు మాట్లాడుతూ, బీజేపీ చేపట్టిన నిరంతర పోరాటం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతుల ధాన్యం బకాయిలను విడుదల చేసిందని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ వికాసరావు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్‌తో పాటు వేములవాడ పట్టణ, రూరల్ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం కేజీబీవీలో ఎమ్మెల్యే సంజయ్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులకు సౌకర్యాలపై ఆరా**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన ఆయన.. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారికి పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, బోధన తీరుపై వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



# సర్పంచ్ కుటుంబానికి సత్యం పరామర్శ

గంగాధర, ఆగస్టు 4 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్ తండ్రి రేండ్ల ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే, ముత్తయ్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ముత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ధైర్యం చెబుతూ, ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# స్కైరూట్ ఏరోస్పేస్ ఇంజినీర్లకు ఘన సన్మానం

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్లలోని జేఎన్టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థలో కీలక పాత్ర పోషించిన యువ ఇంజినీర్లు అడుపు సంతోష్ కుమార్, అడుపు కిరణ్, బొమ్మదేవి నాగరాజులకు కళాశాల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. వేణుగోపాల్ మాట్లాడుతూ, సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన యువత కూడా ఉన్నత లక్ష్యాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలవగలరని ఈ యువ ఇంజినీర్లు నిరూపించారని అన్నారు. వారి విజయగాథ కళాశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం స్కైరూట్ ఏరోస్పేస్ ఇంజినీర్లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, తమను తాము ఎప్పుడూ తక్కువ అంచనా వేసుకోకూడదని సూచించారు. ఇంగ్లీష్‌పై పూర్తి పట్టు లేకపోయినా, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పరిమితంగా ఉన్నా నిరుత్సాహపడకుండా కృషి చేస్తే లక్ష్యాలను చేరుకోవచ్చని చెప్పారు. తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో భాగస్వాములయ్యామని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థి సానుకూల దృక్పథంతో నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. టి. వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రొఫెసర్ ధీరజ్ సునేత్రా సమన్వయం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతతోనే కాంగ్రెస్ బలోపేతం: బీరం రాజేష్

రాయికల్, ఆగస్టు 4 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం రాయికల్ పట్టణంలో పట్టణ, మండల యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యువతకు అవకాశాలు కల్పిస్తోందని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అర్హులైన వారికి వాటి ప్రయోజనాలు అందేలా అవగాహన కల్పించాలని సూచించారు. యువత ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో యువత చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ వైస్‌ప్రెసిడెంట్ బలుస సాయి, అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ కర్నె భూమారెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొద్దుల శివతో పాటు పట్టణ, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఇది మన బ్రాండ్..!

## జీఐ ట్యాగ్‌లతో భారతీయ సంపదకు ప్రపంచ మార్కెట్

### సంప్రదాయ ఉత్పత్తులకు గుర్తింపు.. కళాకారులు, రైతులకు ఆదాయం

### 2030 నాటికి 10 వేల జీఐ నమోదులే లక్ష్యం

**భారతదేశ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్‌లు దేశ సంప్రదాయ ఉత్పత్తులకు కొత్త ఊపునిస్తున్నాయి. నకిలీ ఉత్పత్తులను అడ్డుకోవడంతో పాటు అసలైన కళాకారులు, చేనేత కార్మికులు, రైతులు, ఉత్పత్తిదారులకు అధిక ఆదాయం, అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు తీసుకొస్తున్నాయి. ప్రభుత్వం చట్టపరమైన రక్షణ, ఆర్థిక ప్రోత్సాహకాలు, ఎగుమతుల ప్రోత్సాహం, పర్యాటకంతో అనుసంధానం వంటి చర్యల ద్వారా జీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.**

### భారత్‌లో జీఐ ట్యాగ్‌ల చరిత్ర


భారత్‌లో తొలి జీఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తి పశ్చిమ బెంగాల్‌కు చెందిన డార్జిలింగ్ టీ. ఆ తర్వాత కేరళలోని అరణ్ముల కన్నాడి, తెలంగాణలోని పోచంపల్లి ఇకత్ వంటి ఉత్పత్తులు జీఐ గుర్తింపు పొందాయి. గత పదేళ్లలో జీఐ అధీకృత వినియోగదారుల సంఖ్య 365 నుంచి సుమారు 29 వేల వరకు పెరిగింది. భారత్‌లో జీఐ ట్యాగ్‌లకు 1999 నాటి "భౌగోళిక సూచికల వస్తువుల (నమోదు, రక్షణ) చట్టం" కింద రక్షణ కల్పిస్తున్నారు. 2003 నుంచి అమల్లోకి వచ్చిన ఈ వ్యవస్థలో 2004-05 నుంచి జీఐ నమోదులు ప్రారంభమయ్యాయి. 2025లో నిబంధనల్లో సవరణలు చేశారు. దరఖాస్తు ఫీజును 80 శాతం తగ్గించగా, పునరుద్ధరణ రుసుమును రూ.3,000 నుంచి రూ.500కు తగ్గించారు.

### ఎగుమతుల్లో జీఐ ఉత్పత్తుల దూకుడు

జీఐ ఉత్పత్తుల ఎగుమతులకు ఏపీడీఏ మద్దతు ఇస్తోంది. నాణ్యత, మౌలిక వసతులు, మార్కెటింగ్, అంతర్జాతీయ మార్కెట్ల కల్పన ద్వారా రైతులకు అధిక లాభాలు అందిస్తోంది. కర్ణాటక పండ్లు మాల్దీవులకు ఎగుమతి కావడంతో రైతులకు 40-50 శాతం అధిక ఆదాయం లభించింది. జోహా బియ్యం యూకే, ఇటలీ మార్కెట్లలోకి ప్రవేశించింది. తేజ్‌పూర్ లీచీ దుబాయ్‌లో సుమారు 10 శాతం అధిక ధర సాధించింది. భారత్-ఒమన్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం కర్ణాటక ఇండి నిమ్మకాయలు ఒమన్‌కు ఎగుమతి అయ్యాయి. న్యూజిలాండ్ భారత జీఐ ఉత్పత్తులకు రక్షణ కల్పించేందుకు అంగీకరించింది. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య చర్చల్లో జీఐ ఒప్పందం కీలక అంశంగా మారింది. దేశీయంగా ఢిల్లీ హాట్, జీఐ ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, అంతర్జాతీయ ప్రదర్శనల ద్వారా జీఐ ఉత్పత్తులను ప్రచారం చేస్తున్నారు. వరల్డ్ ఫుడ్ ఇండియా, ట్రైబల్ బిజినెస్ కాన్‌క్లేవ్, ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వంటి వేదికలపై జీఐ ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పించారు. విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లలోనూ వీటి ప్రచారం సాగుతోంది. భారత సంప్రదాయ ఉత్పత్తులను ప్రపంచ బ్రాండ్లుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, కళాకారులు-రైతుల ఆదాయాన్ని పెంచడం, ఎగుమతులను విస్తరించడం లక్ష్యంగా 2030 నాటికి 10 వేల జీఐ నమోదులు సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జీఐ ట్యాగ్‌లు భారత వారసత్వాన్ని ప్రపంచ మార్కెట్లకు అనుసంధానించే శక్తివంతమైన సాధనంగా మారుతున్నాయి.

### బనారసీ చీరే ఉత్తమ ఉదాహరణ

బనారస్‌కు చెందిన నేసవాడు వారాల తరబడి శ్రమించి బనారసీ చీరను తయారు చేస్తాడు. తరతరాలుగా వస్తున్న ప్రత్యేక జరీ నైపుణ్యంతో రూపొందే ఈ చీరలను నకిలీ ఉత్పత్తుల కారణంగా




చాలాసార్లు తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోంది. అయితే జీఐ ట్యాగ్ ద్వారా అది అసలైన బనారసీ చీరేనని ధృవీకరణ లభించడంతో మార్కెట్లో అధిక ధర లభిస్తోంది. దీంతో కళాకారులకు ఎక్కువ ఆదాయం సమకూరుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ బెల్లానికి జీఐ ట్యాగ్ రావడంతో దానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ గుర్తింపుతో బ్రిజ్‌నందన్ అగ్రో రైతు ఉత్పత్తిదారుల సంస్థ 2025లో 30 మెట్రిక్ టన్నుల బెల్లాన్ని బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసింది. సంస్థకు చెందిన 545 మంది రైతుల ఆదాయ అవకాశాలు పెరిగాయి.

### జీఐ ట్యాగ్‌తో కలిగే ప్రయోజనాలు

- ఉత్పత్తి నాణ్యతపై వినియోగదారుల్లో విశ్వాసం పెరుగుతుంది.
- నకిలీ ఉత్పత్తులను నియంత్రించవచ్చు.
- కళాకారులు, రైతులు ప్రీమియం మార్కెట్లలోకి ప్రవేశించగలుగుతారు.
- బేరసారాల శక్తి పెరిగి మెరుగైన ధర లభిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.
- భారతీయ సంప్రదాయ కళలు, సంస్కృతి, స్థానిక నైపుణ్యాలను తరతరాలకు అందించవచ్చు.
- వస్త్ర మంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం జీఐ ట్యాగ్ వల్ల గ్రామీణ కళాకారుల ఆదాయం 20 నుంచి 30 శాతం వరకు పెరుగుతుంది.




### జీఐ ట్యాగ్ అంటే..

ఒక ఉత్పత్తి నిర్దిష్ట ప్రాంతంలోనే సంప్రదాయ పద్ధతులతో తయారవుతుందని ధృవీకరించే గుర్తింపే జీఐ ట్యాగ్. ఇది ఉత్పత్తి అసలుదనాన్ని, నాణ్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని వినియోగదారులకు తెలియజేస్తుంది. ఫలితంగా ఆ ఉత్పత్తికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధర లభిస్తుంది. అసలైన ఉత్పత్తిదారులకు తగిన గుర్తింపు, మెరుగైన ఆదాయం అందుతుంది.

### భారత్‌లో జీఐ ఉత్పత్తుల విస్తృతి

| | |
|---|---|
| హస్తకళలు | 445 ఉత్పత్తులు, 27 లోగోలు |
| వ్యవసాయ ఉత్పత్తులు | 251 |
| తయారీ ఉత్పత్తులు | 64 |
| ఆహార ఉత్పత్తులు | 66 |
| సహజ ఉత్పత్తులు | 5 |

2025 డిసెంబర్ నాటికి భారత్‌లో నమోదైన జీఐ ఉత్పత్తులు వివిధ విభాగాల్లో ఉన్నాయి.

(దేశంలో మొత్తం 800కు పైగా జీఐ నమోదులు ఉండగా, 2014 తర్వాత ఒక్కటే 607 జీఐలు మంజూరయ్యాయి.)

(జీఐ ఉత్పత్తుల్లో ఉత్తరప్రదేశ్ 81 నమోదులతో అగ్రస్థానంలో ఉంది. తర్వాత తమిళనాడు (76), మహారాష్ట్ర (55) ఉన్నాయి.)

### జీఐ నమోదు ఎలా చేసుకోవాలంటే..

ఉత్పత్తిదారుల సంఘాలు, చట్టబద్ధ సంస్థలు లేదా సంబంధిత అధికార సంస్థలు జీఐ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జీఐ నమోదు పదేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. అనంతరం పునరుద్ధరించుకోవచ్చు. మోసం, తప్పుడు సమాచారం, వినియోగదారులను తప్పుదోవ పట్టించే పరిస్థితులు తలెత్తితే జీఐ రద్దు చేసే అవకాశం కూడా ఉంది.

**ప్రభుత్వ ప్రోత్సాహకాలు:**

- జీఐ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది.
- పీఎం ఏకతా మాల్ ద్వారా జీఐ ఉత్పత్తుల విక్రయాలు.
- వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ పథకం కింద రైల్వే స్టేషన్లలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు.
- జీఐ ట్రైల్స్ ద్వారా పర్యాటకంతో అనుసంధానం. అస్సాంలో ముగా సిల్క్ ట్రైల్ ప్రారంభం.
- ఎంఎస్ఎంఈ ఇన్నోవేటివ్ స్కీమ్ కింద జీఐ నమోదు ఖర్చుకు గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రీయింబర్స్‌మెంట్.
- చేనేత, హస్తకళల అభివృద్ధి పథకాల ద్వారా జీఐ రక్షణకు ఆర్థిక సహాయం.

పీఐబీ సహకారంతో..



వయ్యారి చిత్రం






(శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)


ప్రదీప్ రావత్ మరణంతో కేవలం ఒక నటుడినే కాదు.. ఐదు భాషల్లో తనదైన ముద్ర వేసిన అరుదైన కళాకారుడిని భారతీయ సినిమా కోల్పోయింది. సినిమా అంటే హీరోలే కాదు.. కథను నిలబెట్టే ప్రతినాయకుడూ అంతే కీలకమని తన నటనతో నిరూపించిన నటుల్లో ప్రదీప్ రావత్ ముందువరుసలో నిలుస్తారు. హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించిన ఆయన, ప్రతి పాత్రకు తనదైన శరీరభాష, స్వరతీరు, హావభావాలతో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. పాత్ర చిన్నదా, పెద్దదా అనే తేడా లేకుండా తెరపై కనిపించిన ప్రతి క్షణాన్ని గుర్తుండిపోయేలా చేయడం ఆయన ప్రత్యేకత.

**వెండితెరపై ఆయన కనిపిస్తే హీరోకే కాదు.. ప్రేక్షకుల గుండెల్లోనూ ఉత్కంఠ మొదలయ్యేది. కళ్లలో క్రూరత్వం.. మాటల్లో కర్కశత్వం.. నటనలో అసాధారణ సహజత్వం. కానీ కెమెరా ఆగిపోయాక అదే వ్యక్తి అత్యంత నిరాడంబరుడు, సహనశీలి, స్నేహపూర్వకుడు. విలన్ పాత్రలకు కొత్త నిర్వచనం చెప్పిన భారతీయ సినీ రంగం విలక్షణ నటుడు ప్రదీప్ రావత్ ఇక లేరు.**

## విలన్‌గా భయపెట్టాడు.. మనిషిగా గెలిచాడు!

# భిక్షు యాదవ్ ఇక లేరు

**సినీ ప్రపంచాన్ని శోకసంద్రంలో ముంచిన ప్రదీప్ రావత్**



### అసాధారణ నటుడిగా..

1952 జనవరి 21న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించిన ప్రదీప్ రావత్ సాధారణ కుటుంబంలో పెరిగారు. సిమ్లాలో విద్యాభ్యాసం పూర్తి చేసి, జబల్‌పూర్ ప్రభుత్వ సైన్స్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. కొంతకాలం బ్యాంకు ఉద్యోగిగా పనిచేశారు. జీవితంలో స్థిరమైన ఉద్యోగం ఉన్నప్పటికీ కళలపై ఉన్న అభిరుచి ఆయనను నటనా ప్రపంచం వైపు మళ్లించింది. అదే నిర్ణయం భారతీయ సినీ రంగానికి ఒక గొప్ప ప్రతినాయక నటుడిని అందించింది. 1988లో బి.ఆర్. చోప్రా రూపొందించిన మహాభారత్ ధారావాహికలో అశ్వత్థామ పాత్ర పోషించిన తర్వాత దేశవ్యాప్తంగా ఆయన పేరు మార్మోగింది. ఆ పాత్రలో కనిపించిన గంభీరత, ఆవేశం, భావ వ్యక్తీకరణ దర్శకుల దృష్టిని ఆకర్షించాయి. అనంతరం హిందీలో సర్ఫరోష్, లగాన్ వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా ప్రతి పాత్రలో కొత్త కోణాన్ని చూపించడం ఆయన ప్రత్యేకత.

### 'భిక్షు యాదవ్'.. తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేని పేరు

తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రదీప్ రావత్ అంటే ముందుగా గుర్తొచ్చేది 'సై' సినిమాలోని 'భిక్షు యాదవ్'. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన ఆ చిత్రంలో ఆయన నటన తెలుగు తెరపై విలన్ పాత్రలకు కొత్త స్థాయిని తీసుకొచ్చింది. హీరోతో సమానంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన పాత్రల్లో భిక్షు యాదవ్ ఒకటి. ఆ తర్వాత ఛత్రపతి, భద్ర, అందరివాడు, నాయక్, నా పేరు సూర్య వంటి చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. సై చిత్రంలో అద్భుత నటనకు గాను నంది అవార్డు, సంతోషం అవార్డు, ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ విలన్ అవార్డు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. అవార్డుల కంటే ప్రేక్షకుల ప్రేమే గొప్ప గుర్తింపని భావించిన ఆయన, ప్రతి చిత్రంలో పాత్రకు పూర్తి న్యాయం చేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకప్పుడు విలన్ అంటే కేవలం అరుపులు, ఆవేశమే అన్న అభిప్రాయాన్ని ప్రదీప్ రావత్ చెరిపేశారు. ప్రశాంతంగా మాట్లాడుతూనే భయాన్ని పుట్టించే నటన, కళ్లతోనే భావాలను పలికించే అభినయం, శరీర భాషతో పాత్రను జీవింపజేసే నైపుణ్యం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. అందుకే దర్శకులు ఆయన కోసం ప్రత్యేకంగా పాత్రలు రూపొందించేవారు. సినిమా చరిత్రలో కొందరు నటులు కేవలం పాత్రలు పోషించరు.. పాత్రలకే చిరునామాగా మారిపోతారు. ప్రదీప్ రావత్ అలాంటి అరుదైన నటుడు. ఆయన నటించిన సినిమాలు, పలికించిన సంభాషణలు, చూపించిన హావభావాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఒక గొప్ప నటుడు శారీరకంగా మన మధ్య లేకపోయినా, వెండితెరపై ఆయన సృష్టించిన పాత్రలు ఎన్నటికీ చెరిగిపోవు.







## 9న దూకుడు రీరిలీజ్

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు ఆగస్టు 9 అంటే ఒక అతిపెద్ద పండుగ రోజు. ఈ ఏడాది ఆయన పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఒకవైపు కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన ఐకానిక్ సినిమా 'దూకుడు' 4కే వెర్షన్ రీ-రిలీజ్‌తో థియేటర్లలో రచ్చ చేయడానికి వస్తుంటే, మరోవైపు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న రాజమౌళి ప్రాజెక్ట్ నుంచి రాబోయే భారీ అప్‌డేట్ టాలీవుడ్‌లో వేడిని పెంచుతోంది. మళ్ళీ మొదలైన 'దూకుడు' హంగామా: శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చిన 'దూకుడు' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టించిందో మనందరికీ తెలిసిందే. కామెడీ, యాక్షన్, డైలాగ్ డెలివరీతో మహేష్ బాబు థియేటర్లను ఊపేశారు. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను మళ్ళీ వెండితెరపై చూసేందుకు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా 4కే క్వాలిటీతో, మైండ్ బ్లోయింగ్ సౌండ్ సిస్టమ్‌తో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులు: రీ-రిలీజ్ ట్రైలర్ బయటకు వచ్చినప్పటి నుంచే సోషల్ మీడియాలో డీహెచ్‌ఎఫ్‌ఎమ్ హంగామా మొదలైపోయింది. ఇప్పటికే టికెట్ బుకింగ్స్ ఓపెన్ అవ్వగా, అనేక ప్రాంతాల్లో నిమిషాల వ్యవధిలోనే షోలు హౌస్‌ఫుల్ అయిపోతున్నాయి. పాత జ్ఞాపకాలను మళ్ళీ గుర్తుచేసుకుంటూ థియేటర్లలో రచ్చ చేయడానికి ఫ్యాన్స్ సిద్ధమైపోయారు.

## నా పర్సనల్ లైఫ్ మీకేం తెలుసు?


యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను.





## 41 గంటలు షూటింగ్‌లోనే కీర్తి సురేష్

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు.



## వేధించే వారి అకౌంట్లు ట్యాగ్ చేయండి: మృణాల్

డీప్‌ఫేక్ కంటెంట్‌ను దుర్వినియోగం చేయడంపై ఇటీవలే తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఆన్‌లైన్ వేధింపులపై మరో ముందడుగు వేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయాలని నెటిజన్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించే, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన లేదా అంగీకారం లేకుండా తీసిన వ్యక్తిగత చిత్రాలను పంచుకునే అకౌంట్ల వివరాలను ట్యాగ్ చేయాలని మృణాల్ కోరారు. "ఇంటర్నెట్‌లోని ఈ మేధావుల కోసం ఓ 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్మిద్దాం. వేధించే ఖాతాలను గుర్తిస్తే, వాటిని ట్యాగ్ చేయండి. ఇలాంటివి డాక్యుమెంట్ చేయడం చాలా అవసరం" అని తన పోస్టులో పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితమే డీప్‌ఫేక్‌పై మృణాల్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే.

## తీవ్ర ఒత్తిడిలో పాప్ స్టార్

ప్రముఖ పాప్ స్టార్, నటి అరియానా గ్రాండే కెరీర్‌కు సంబంధించి ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. లండన్‌లోని ప్రసిద్ధ బాంబికన్ థియేటర్‌లో 2027లో ప్రదర్శించడానికి సిద్ధమైన -స్టేజ్ మ్యూజికల్ సండే ఇన్ ది పార్క్ విత్ జార్జ్- ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం హాలీవుడ్ వర్గాలతో పాటు అభిమానులలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ప్రతిష్టాత్మక నాటకంలో అరియానా -వికెడ్- సహనటుడు జోనాథన్ బెయిలీతో కలిసి నటించాల్సి ఉంది. అయితే కొద్దికాలంగా అరియానపై వస్తోన్న పబ్లిక్ స్క్రిటినీ ..నిరంతర ఆన్‌లైన్ చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అరియానా ప్రతినిధి తెలిపారు. తనపై వస్తోన్న అనవసరమైన వ్యాఖ్యల వల్ల మానసికంగా ఒత్తిడికి గురవుతున్నట్లు గతంలోనూ అరియానా పలుమార్లు వెల్లడించారు.





# ఇంగ్లండ్‌కు కోచింగ్ ఇవ్వాలనుంది

**అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బెన్ స్టోక్స్ యూటర్న్ గురించి వస్తున్న వార్తలను ఖండించాడు. వచ్చే ఏడాది యాషెస్ సిరీస్‌లో స్టోక్స్ ఆడే అవకాశాలున్నాయని ఈసీబీ ఎండీ రాబ్ కీ పేర్కొనడం అంతా ఉత్తిదే అని స్టోక్స్ తేల్చేశాడు. తనకు యాషెస్ ఆడాలనే ఉద్దేశం లేదని, కాకపోతే ఇంగ్లండ్ జట్టుకు ప్రధాన కోచ్‌గా సేవలందించాలని ఉందని 35 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ తన మనసులోని మాటను వెల్లడించాడు.**

ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగిన బెన్ స్టోక్స్ కోచ్‌గా అవతారమెత్తాలని అనుకుంటున్నాడు. టెస్టు క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే అతడు.. తిరిగి కోచ్‌గా ఇంగ్లండ్ జట్టుకు మెలకులు నేర్పాలని ఆరాటపడుతున్నాడు. ఈ విషయాన్ని స్టోక్స్ స్వయంగా చెప్పాడు. 'నేను లెవల్ త్రీ కోచింగ్‌లో ఉన్నా. ప్రస్తుతం నేను దేశవాళీలో ఆడుతున్నా. పూర్తిగా ఆట మానేశాక నేను కోచింగ్ ఇవ్వాలనుకుంటున్నా. రిటైరైనా.. క్రికెట్‌తో ఎలా కొనసాగాలో నాకు తెలుసు. ఏదో ఒకరోజు ఇంగ్లండ్ కోచ్‌గా పనిచేయడాన్ని నేను ఇష్టపడతాను. ఆటను వదిలేశాక.. నా మనసులో తట్టిన ఆలోచన అదే' అని స్టోక్స్ వివరించాడు. లార్డ్స్ టెస్టులో ఓటమి అనంతరం స్టోక్స్ వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌ను 'స్టోక్స్‌కు ముందు.. స్టోక్స్ తర్వాత' అని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే.. సంప్రదాయ క్రికెట్‌నే నమ్ముకున్న జట్టుకు దూకుడు నేర్పిన కెప్టెన్లలో స్టోక్స్ పేరు ముందు వరుసలో ఉంటుంది. ఎంత పెద్ద లక్ష్యమైనా సరే.. వికెట్లు పడుతున్నా సరే.. దంచుడే పరమావధిగా ఆడడం అతడి నైజం. జో రూట్ వారసుడిగా 2022లో టెస్టు పగ్గాలు అందుకున్న స్టోక్స్.. బజ్‌బాల్ ఆటను పరిచయం చేశాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ హెడ్‌కోచ్‌గా, దూకుడే మంత్రగా ఆడే స్టోక్స్ సారథ్యంలో.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ వన్డే తరహాలో ఆడడం అలవర్చుకుంది ఇంగ్లండ్. అయితే.. యాషెస్ సిరీస్‌లో పరాజయం, ఆపై స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 1-2తో సిరీస్ ఓటమితో విమర్శలపాలయ్యాడు స్టోక్స్. ఇక టైమ్ వచ్చేసింది అనుకున్నాడేమో లార్డ్స్ టెస్టు మధ్యలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడీ వెటరన్.

# కేఎల్ కోపంగా ఉండటం అదే తొలిసారి: వసీం జాఫర్



టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ రాహుల్ సాధారణంగా చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంటాడని.. కానీ ఐపీఎల్‌లో పంజాబ్ జట్టు ప్రదర్శన కారణంగా అతను తీవ్ర నిరాశకు గురయ్యాడని భారత మాజీ క్రికెటర్, పంజాబ్ కింగ్స్ మాజీ బ్యాటింగ్ కోచ్ వసీం జాఫర్ తెలిపారు. అలాగే తన కెరీర్‌లో ఒకే ఒక్కసారి కోపంగా ఉండటం చూశానని దూరదర్శన్‌లోని 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో మాట్లాడుతూ, ఆ ఫ్రాంచైజీతో తన కోచింగ్ అనుభవాలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను జాఫర్ జాఫర్ వెల్లడించారు. కేఎల్ రాహుల్ 2018 నుండి 2021 వరకు పంజాబ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్యాటింగ్‌లో రాణించినప్పటికి జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమయ్యాడు. అదే సమయంలో వసీం జాఫర్ ఆ జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేశారు. ఈ క్రమంలో జాఫర్ నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పంజాబ్ చాలా సార్లు గెలిచే స్థితిలో ఉండి కూడా మ్యాచ్‌లు స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామన్నారు. రాహుల్ సహజంగానే చాలా ప్రశాంతంగా ఉండే వ్యక్తి మితభాషి. ఎక్కువగా తన సన్నిహిత స్నేహితుల మధ్యే గుడపుతారు. బయట ఎక్కువగా కనిపించరు.

# రహానేకు ఘోర అవమానాలు



ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన అజింక్య రహానే గురించి సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అతని కెరీర్ లో అడుగడుగున అవమానాలు ఎదురయ్యాయని.. అతడి ప్రతిభను బీసీసీఐ గుర్తించలేదని మండిపడ్డారు. గతంలో రాహుల్ ద్రావిడ్ కు కూడా ఇలాంటి అవమానాలే ఎదురయ్యాయని గుర్తు చేశారు. భారత జట్టుకు అమూల్యమైన సేవలు అందించిన క్రికెటర్లకు బీసీసీఐ ప్రత్యేక వీడ్కోలు మ్యాచ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. అజింక్య రహానే కెప్టెన్సీలో భారత్ జట్టు 6 టెస్టులు ఆడిందని, ఇందులో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదని గుర్తు చేశారు. ఆడిన ఆరింటిలో నాలుగు మ్యాచ్ లు భారత్ విజయం సాధించడం గొప్ప విషయం అన్నారు. కానీ రహానేకు మాత్రం ఆ క్రెడిట్ దక్కలేదని తెలిపారు. రాహుల్ ద్రావిడ్ కెప్టెన్సీలో కూడా భారత జట్టు చాలా విజయాలు నమోదు చేసుకుందని గుర్తు చేశారు. కానీ అప్పటి జట్టులో ఉన్న ప్లేయర్లకు మాత్రమే బీసీసీఐ నుంచి గౌరవం దక్కిందని మండిపడ్డారు.





# శ్రీలంక చేరిన టీమిండియా

## 7న తొలి టెస్ట్ ప్రారంభం

భారత్, లంక మధ్య మరో రెండు రోజుల్లో టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఆగస్టు 7వ తేదీ నుంచి ప్రారంభం కాబోతున్న టెస్ట్ సిరీస్ నేపథ్యంలో శ్రీలంకకు చేరింది భారత జట్టు. ముంబై నుంచి నేరుగా కొలంబోకు వెళ్లారు భారత క్రికెటర్లు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఉన్న భారత క్రికెటర్ల ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ టెస్ట్ సిరీస్ నేపథ్యంలో చాలా రోజుల తర్వాత ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా మళ్లీ ఎంట్రీ ఇస్తున్నాడు. బుమ్రాకు గాయమైన నేపథ్యంలో అకీబ్ నబీ దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఆగస్టు 7వ తేదీన భారత్, శ్రీలంక మధ్య గాల్లే వేదికగా తొలి టెస్ట్ షురూ అవుతుంది. ఈ మ్యాచ్ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 23వ తేదీన కొలంబో వేదికగా జరుగనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కు అర్హత సాధించాలంటే, ఈ రెండు టెస్టులు కచ్చితంగా భారత్ గెలవాలి. లేకపోతే, ఫైనల్ ఆడే అర్హత్ కోల్పోనుంది.



# గంభీర్‌పై సీనియర్ల ఫిర్యాదు?

## హెడ్ కోచ్ శైలిపై ఆటగాళ్ల అసంతృప్తి

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కోచింగ్ శైలిపై జట్టులోని కొందరు సీనియర్ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గంభీర్ పద్ధతులపై తమకున్న అభ్యంతరాలను కొందరు సీనియర్లు... మాజీ క్రికెటర్లతో పాటు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లోని సభ్యులకు అనధికారికంగా తెలియజేసినట్లు సమాచారం. ఈ పరిణామంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. జట్టు ఓటమికి గంభీర్ బాధ్యత స్వీకరించడానికి ఇష్టపడటం లేదని, ఓటమి భారాన్ని ఆటగాళ్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లేదా సహాయక సిబ్బందిపై నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఓ నివేదిక పేర్కొంది. ఓటమికి కారణం యాజమాన్య నిర్ణయాలు కాదన్నట్లుగా అతను వ్యవహరిస్తున్నాడని, ఈ భావనే ఆటగాళ్లలో అసంతృప్తికి కారణమవుతోందని తెలుస్తోంది. ఈ వ్యవహారం డ్రెస్సింగ్ రూమ్‌లోనూ చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. ఈ పరిణామాలపై బోర్డు అధికారులు కూడా ఆందోళన చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ అనధికారిక ఫిర్యాదులు, ఆరోపణలు ఎలా ఉన్నప్పటికీ గౌతమ్ గంభీర్‌పై బీసీసీఐ పూర్తి విశ్వాసంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. జట్టులో ఇప్పటికీ అతడే కీలక అధికారిగా, సర్వాధికారాలు కలిగిన వ్యక్తిగా కొనసాగుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలలో వైట్-బాల్ సిరీస్‌లలో ఓటములు, స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టుల్లో వైట్‌వాష్, దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమి వంటి ఫలితాల నేపథ్యంలో గంభీర్ కోచింగ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శ్రీలంకతో జరగబోయే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ గంభీర్, అతని కోచింగ్ బృందానికి అత్యంత కీలకంగా మారింది. పలువురు కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోవడం వారికి అదనపు సవాల్‌గా మారింది. ప్రస్తుతానికి ఈ చర్చలన్నీ అనధికారిక స్థాయిలోనే ఉన్నాయని, గంభీర్‌కు బోర్డు మద్దతు కొనసాగుతుందని స్పష్టమవుతోంది.



# వైల్డ్‌కార్డుతో విలియమ్స్ సిస్టర్స్ ఎంట్రీ!

మహిళల టెన్నిస్‌ను ఏలిన 'విలియమ్స్ సిస్టర్స్' మళ్లీ జోడీ కడుతున్నారు. కోర్టులోకి దిగారంటే తిరుగులేని ఆధిపత్యంతో రికార్డులు బద్ధలుకొట్టే సెరీనా విలియమ్స్, వీనస్ విలియమ్స్‌లు నాలుగేళ్ల తర్వాత డబుల్స్‌లో జంటగా ఆడబోతున్నారు. త్వరలో జరుగనున్న సిన్సినాటి ఓపెన్‌లో ఈ అమెరికా నల్లకలువలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమైంది. సింగిల్స్, డబుల్స్ ఏదైనా.. టైటిల్ మాదే అన్నట్టు చెలరేగి ఆడే విలియన్స్ సిస్టర్స్ మళ్లీ జంటగా అభిమానులను అలరించనున్నారు. నాలుగేళ్ల విరామం తర్వాత వీరిద్దరూ మహిళల డబుల్స్‌లో ప్రత్యర్థుల భరతం పట్టేందుకు వస్తున్నారు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌తోనే ఇద్దరూ అక్కాచెళ్లెల్లు కలిసి ఆడాలని భావించారు. కానీ, అవకాశం చేజారింది. ఇప్పుడు సిన్సినాటి ఓపెన్‌లో వీరికి వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. ఆగస్టు 8వ తేదీన ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఇదివరకూ 2022 యూఎస్ ఓపెన్‌లో చివరిసారిగా కలిసి ఆడారీ వెటరన్ సిస్టర్స్. గతంలో డబుల్స్ జోడీగా వీరు 14 టైటిళ్లు సాధించిన విషయం తెలిసిందే.


## క్రికెటర్లకు వరుస గాయాలు..

# బీసీసీఐ గరంగరం

బిజీ షెడ్యూల్ కారణంగా భారత క్రికెటర్లు ఈ మధ్య కాలంలో గాయాల బారిన పడుతున్న సంగతి తెలిసిందే. హార్దిక్ పాండ్యా, నితీష్, హర్షిత్ ఇప్పటికే గాయాల బారిన పడగా, లేటెస్ట్ గా బూమ్ బూమ్ బుమ్రా కూడా గాయపడ్డాడు. శ్రీలంకతో ఈ నెలలో జరిగే రెండు టెస్టుల సిరీస్ కు సెలెక్ట్ అయిన బుమ్రాకు కూడా గాయం కావడంతో భారత జట్టు శిబిరంలో కొత్త టెన్షన్ మొదలైంది. అయితే ఈ పరిణామాల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి అలర్ట్ అయింది. శ్రీలంకతో జరిగే టెస్ట్ సిరీస్ పూర్తయిన తర్వాత హై లెవెల్ రివ్యూ మీటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఫిజియోథెరపిస్టు కమలేష్, భారత జట్టు డాక్టర్ రిజ్వాన్ పనితీరుపైన రివ్యూ చేసేందుకు సిద్ధమైందట. ప్లేయర్లు ఫిట్ కాకముందే.. బరిలోకి దింపుతున్నారనే అనుమానం వ్యక్తం చేసిన బీసీసీఐ.. రివ్యూ నిర్వహించేందుకే సిద్ధమైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒకవేళ తమ అనుమానాలు నిజమే అయితే... గౌతమ్ గంభీర్ నుంచి మొదలుకొని అందరిపై చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధమవుతున్నారట. దీంతో భారత జట్టు కోచింగ్ డిపార్ట్మెంట్ లో కొత్త టెన్షన్ మొదలైంది.

# డైమండ్ లీగ్ లోకి నీరజ్ చోప్రా

వరుస మెడల్స్ తో దూసుకు వెళ్తున్న నీరజ్ చోప్రా ఇప్పుడు డైమండ్ లీగ్ పైన కన్నేసినట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ జరిగాయి. ఇందులో పాల్గొన్న నీరజ్ చోప్రా, సిల్వర్ మెడల్ కూడా దక్కించుకున్నాడు. అయితే ఇప్పుడు లౌసాన్ డైమండ్ లీగ్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడట. స్విట్జర్లాండ్ వేదికగా ఈ మెగా ఈవెంట్ జరగనుంది. ఆగస్టు 21వ తేదీన జరిగే ఈ పోటీలో నీరజ్ చోప్రా పాల్గొంటాడు. కామన్ వెల్త్ గేమ్స్ ఛాంపియన్ రుమేష్, పారిస్ ఒలంపిక్స్ గోల్డ్ మెడలిస్టు అర్షద్ నదీమ్ తదితరులు కూడా నీరజ్ తో పాటు ఇందులో పాల్గొంటారు. మొన్నటి కామన్వెల్త్ గేమ్స్ లో గోల్డ్, అంతకు ముందు దోహా డైమండ్ లీగ్ లో మెడల్ ను మిస్ చేసుకున్న నీరజ్...ఈ సారి ఎలాగైనా తొలి స్థానాన్ని దక్కించుకునేందుకు కసరత్తులు మొదలు పెట్టారు.



ఈవార్తలు
# ప్రజావాణి
బుధవారం 5-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## విలువ లేని మాట..!

ఉచితాలు, అభివృద్ధి, ఉద్యోగాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, గ్రామాల అభివృద్ధి.. ఇలా హామీల జాబితా అంతులేనిది. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజల మనసుల్లో ఒక్కటే ప్రశ్న మిగులుతోంది.. హామీల హడావుడి సరే... ఫలితాలెక్కడ? ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు తప్పు కాదు. అవి రాజకీయ పార్టీల దిశను, ప్రాధాన్యతలను ప్రజలకు తెలియజేసే సాధనం. అయితే హామీలు కేవలం ఓట్లు పొందే ఆయుధంగా మారి, అమలు మాత్రం నిర్లక్ష్యానికి గురైతే ప్రజాస్వామ్యంపై నమ్మకం దెబ్బతింటుంది. మాటలకు విలువ లేకపోతే రాజకీయాలపై విశ్వాసం కూడా క్రమంగా క్షీణిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు భారీ ప్రకటనలు చేస్తున్నాయి. లక్షల కోట్ల పెట్టుబడులు, కోట్లాది ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అంటూ ప్రచారం జరుగుతోంది. కానీ గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయి. పంచాయతీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. పట్టణాల్లో ట్రాఫిక్, కాలుష్యం, మౌలిక సదుపాయాల సమస్యలు అలాగే ఉన్నాయి. రైతు ఆదాయం పెరిగిందని చెబుతున్నా, సాగు ఖర్చులు కూడా అదే వేగంతో పెరుగుతున్నాయి. ఉద్యోగాల గురించి ప్రకటనలు వినిపిస్తున్నా, నిరుద్యోగ యువత పరీక్షల కోసం, నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తూనే ఉంది. ఇటీవలి కాలంలో ప్రభుత్వాల పనితీరులో ఒక స్పష్టమైన ధోరణి కనిపిస్తోంది. ఒక పథకం ప్రకటించగానే దానికి సంబంధించిన ప్రకటనలు, పోస్టర్లు, సామాజిక మాధ్యమ ప్రచారం, సభలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. కానీ ఆ పథకం అమలు ఎలా జరుగుతోంది? లక్ష్యాలను చేరుకుందా? ప్రజలకు నిజంగా ఉపయోగపడుతోందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అరుదుగానే వినిపిస్తున్నాయి. ప్రజలు ఇక ప్రకటనలను కాదు, ఫలితాలను కోరుతున్నారు. నిర్మించిన రోడ్డు ఎంతకాలం నిలిచింది? ప్రారంభించిన ఆసుపత్రిలో వైద్యులు ఉన్నారా? ప్రకటించిన ఉద్యోగాలు నిజంగా భర్తీ అయ్యాయా? రైతుకు ప్రకటించిన సాయం సమయానికి అందిందా? గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదలయ్యాయా? ఇవే అసలు ప్రమాణాలు. పాలనను కొలవాల్సింది ప్రకటనల సంఖ్యతో కాదు, ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతో. గ్రామీణాభివృద్ధి దీనికి ఉత్తమ ఉదాహరణ. ప్రతి ప్రభుత్వం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెబుతుంది. కానీ వాస్తవంలో అనేక గ్రామపంచాయతీలు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాగునీటి మోటార్లు మరమ్మతు చేయడానికి, వీధిదీపాలు వెలిగించడానికి, చిన్నపాటి అభివృద్ధి పనులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాయి. ప్రచారంలో గ్రామ స్వరాజ్యం కనిపిస్తున్నా, నేలమీద గ్రామాల ఆర్థిక స్వావలంబన మాత్రం కనిపించడం లేదు.



## యువతపై గుండె 'పోటు'..!

ఒకప్పుడు గుండెపోటు అంటే 60 ఏళ్లు దాటిన వారికే వచ్చే వ్యాధిగా భావించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 20, 30, 40 ఏళ్ల వయసులోనే యువకులు అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యాయామం చేస్తూ, ఉద్యోగంలో ఉండగానే, ఆటలు ఆడుతుండగానే, వేదికపై ప్రసంగిస్తుండగానే ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. దీనికి ఒక్క కారణం చెప్పడం కష్టం.

మారిన జీవనశైలి, ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, నిద్రలేమి, ఫాస్ట్‌ఫుడ్ అలవాట్లు, ధూమపానం, మద్యం, శారీరక శ్రమ తగ్గిపోవడం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు కలిసి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారిలో ప్రమాదం మరింత ఎక్కువగా ఉండొచ్చు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, చాలామంది యువత తమ ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉద్యోగం కోసం గంటల తరబడి కూర్చోవడం, మొబైల్, ల్యాప్‌టాప్‌లకే పరిమితమవడం, చిన్న చిన్న హెచ్చరికలను కూడా పట్టించుకోకపోవడం ప్రమాదాన్ని పెంచుతోంది. ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణ అలసట వంటి లక్షణాలను "గ్యాస్" లేదా "ఒత్తిడి"గా తీసిపారేయడం ప్రాణాంతకమవుతోంది. ఆరోగ్యం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు; అది ప్రజారోగ్య అంశం కూడా. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. యువతకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించే సంస్కృతి పెరగాలి. ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గుండె సంబంధిత పరీక్షలు అందుబాటులోకి తేవాలి. కార్యాలయాలు ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. యువతే దేశ భవిష్యత్తు అని ప్రతి వేదికపై చెబుతాం. అలాంటి యువత గుండెపోటుతో అకాల మరణాలకు గురవుతుంటే, అది కేవలం ఒక కుటుంబానికే కాదు, సమాజానికీ, దేశానికీ తీరని నష్టం. అందుకే ఆరోగ్యాన్ని వాయిదా వేయకుండా, జీవనశైలిని మార్చుకోవడం, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం నేటి అత్యవసర అవసరం. సంపద కోల్పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ గుండె ఆగిపోయిన తర్వాత జీవితం తిరిగి రాదు. యువత ఆరోగ్యమే దేశానికి అసలైన మూలధనం.

– విశాల, రాజమండ్రి

# పల్లె పాలన ఎక్కడ?

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉంది.. అని మహాత్మా గాంధీ చెప్పిన మాటను ప్రతి రాజకీయ నాయకుడు ఎన్నికల సమయంలో పదేపదే ఉటంకిస్తుంటాడు. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి.. అని ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ, ప్రతి ఎన్నికల సభలోనూ వినిపించే నినాదమిది. కానీ ఆ మాటలకు, నేలమీద కనిపిస్తున్న వాస్తవాలకు మధ్య విపరీతమైన అంతరం ఏర్పడింది. వేలాది గ్రామాలు అభివృద్ధి కంటే అప్పుల భారంతో, నిధుల కొరతతో, పరిపాలనా నిర్లక్ష్యంతో పోరాడుతున్నాయి. గ్రామపంచాయతీలు నిధుల కోసం ప్రభుత్వాల చుట్టూ తిరుగుతుంటే, ప్రభుత్వాలు మాత్రం కొత్త పథకాల ప్రచారంలో మునిగిపోయాయి. గ్రామాల్లో రోడ్లు పాడైపోతున్నాయి. మురుగు కాలువలు మూసుకుపోతున్నాయి. చెత్త సకాలంలో తొలగించడం లేదు. వీధిదీపాలు వెలగడం లేదు. తాగునీటి పైపులు పగిలిపోతే మరమ్మతులకు డబ్బు లేదు. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడానికి నిధులు లేవు. ప్రజలకు కనీస సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు; ఇది పరిపాలనా వైఫల్యం. అంతకంటే ముఖ్యంగా, రాజ్యాంగం గ్రామాలకు కల్పించిన స్వయం పాలన స్ఫూర్తిని నిర్వీర్యం చేసిన రాజకీయ నిర్లక్ష్యం.




**73వ రాజ్యాంగ** సవరణ ద్వారా గ్రామపంచాయతీలకు రాజ్యాంగబద్ధ హోదా ఇచ్చినప్పుడు ఉద్దేశం స్పష్టంగా ఉంది. అధికారాలు, విధులు, నిధులు మూడు సమానంగా అందితేనే స్థానిక స్వపరిపాలన బలపడుతుంది. కానీ దశాబ్దాలు గడిచినా, అధికారాల గురించి గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వాలు, ఆ అధికారాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను మాత్రం ఇవ్వడంలో విఫలమయ్యాయి. "గ్రామ స్వరాజ్యం" అనే గొప్ప భావన క్రమంగా "గ్రామ ఆధారపడే పాలన"గా మారిపోయింది. అసలు సమస్య ఇక్కడే ఉంది. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రకటిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని పథకాలను ప్రకటిస్తాయి. కానీ వాటి అమలులో గ్రామపంచాయతీలను కీలక భాగస్వాములుగా ఉపయోగించుకుని, అవసరమైన నిధులను సమయానికి విడుదల చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తాయి. ఫలితంగా పంచాయతీలు పనులు చేస్తాయి, కానీ బిల్లులు రావు. కాంట్రాక్టర్లు వేచి చూస్తారు. సర్పంచ్‌లు ప్రజల ఎదుట సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుంది. ఈ దేశంలో పెద్దపెద్ద రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, భారీ భవనాలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడంలో ప్రభుత్వాలు వెనుకాడవు. కానీ ఒక గ్రామంలో డ్రైనేజీ నిర్మించడానికి, చెత్త ట్రాక్టర్‌కు డీజిల్ పోయడానికి, తాగునీటి మోటార్ మరమ్మతు చేయడానికి అవసరమైన కొన్ని లక్షల రూపాయలు విడుదల చేయడంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది. ఈ ప్రాధాన్యతలే ప్రభుత్వాల అసలు దృష్టిని బయటపెడుతున్నాయి. ప్రచారం కనిపించే ప్రాజెక్టులకు ప్రాధాన్యం, ప్రజలు ప్రతిరోజూ ఉపయోగించే గ్రామీణ మౌలిక సదుపాయాలకు నిర్లక్ష్యం.. ఇది ప్రస్తుతం కొనసాగుతున్న పరిపాలనా ధోరణి. గ్రామాల్లో ఎన్నికైన సర్పంచ్‌లు నేడు ప్రజాప్రతినిధుల కంటే అప్పుల బాధితులుగా మారిపోయారు. గ్రామాభివృద్ధి కోసం పనులు చేపట్టి, ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని నమ్మి వ్యక్తిగతంగా అప్పులు చేశారు. కానీ బిల్లులు నెలలు, కొన్నిసార్లు సంవత్సరాలు కూడా పెండింగ్‌లో ఉండటంతో వారి కుటుంబాలే ఆర్థికంగా కుదేలవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం పనిచేసిన ప్రజాప్రతినిధులు ఆర్థికంగా శిక్ష అనుభవించడం కన్నా దురదృష్టకరమైన విషయం మరొకటి ఉండదు. ఇది ఒక్క రాష్ట్రం సమస్య కాదు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో గ్రామపంచాయతీలు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. రాజకీయాలు మారుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నాయి. పార్టీలు మారుతున్నాయి. కానీ గ్రామాలకు నిధుల కొరత మాత్రం మారడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఒక పార్టీ కేంద్రాన్ని తప్పుపడుతుంది; ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని విమర్శిస్తుంది. చివరకు రాజకీయ ఆరోపణల మధ్య నష్టపోతున్నది మాత్రం గ్రామమే.

గ్రామపంచాయతీలను కేవలం ఓటర్ల జాబితా నిర్వహించే కార్యాలయాలుగా చూడటం మానేయాలి. అవి స్థానిక ప్రభుత్వాలు. రాజ్యాంగం వాటికి అదే గుర్తింపు ఇచ్చింది. కానీ వ్యవహారంలో మాత్రం ప్రభుత్వ శాఖల ఉపకార్యాలయాల స్థాయికే పరిమితం చేశారు. స్వతంత్ర నిర్ణయాధికారం లేదు. స్వంత ఆదాయ వనరులు తక్కువ. నిధుల కోసం పై అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇలాంటి వ్యవస్థను స్వయం పాలన అని ఎలా చెప్పగలం? స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వకుండా వికేంద్రీకరణ గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమే. ప్రతి ఐదేళ్లకు ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ఎన్నికైన స్థానిక సంస్థలు సమర్థంగా పనిచేసేలా చేయడం కూడా ప్రభుత్వాల బాధ్యతే. ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత నిధులు ఇవ్వకుండా చేతులు దులుపుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రభుత్వాలు తరచూ "అభివృద్ధి" అనే పదాన్ని ప్రచార సాధనంగా ఉపయోగిస్తున్నాయి. ప్రకటనల్లో అభివృద్ధి కనిపిస్తోంది. సోషల్ మీడియా పోస్టుల్లో అభివృద్ధి కనిపిస్తోంది. భారీ సభల్లో అభివృద్ధి ప్రసంగాలు వినిపిస్తున్నాయి. కానీ గ్రామంలో మాత్రం చెత్త పేరుకుపోతోంది. వర్షం వస్తే రోడ్లు కొట్టుకుపోతున్నాయి. కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ప్రజలకు కనిపించే అభివృద్ధి, ప్రచారంలో కనిపించే అభివృద్ధి రెండు వేర్వేరు ప్రపంచాలుగా మారిపోయాయి. ఇంకో ఆందోళనకర అంశం ఏమిటంటే, గ్రామాల ఆర్థిక పరిస్థితి బలహీనపడితే దాని ప్రభావం వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, ఆరోగ్యం, విద్య అన్నింటిపైనా పడుతుంది. రైతుకు రోడ్డు లేకపోతే పంట మార్కెట్‌కు చేరదు. తాగునీరు లేకపోతే ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. పారిశుధ్యం లేకపోతే అంటువ్యాధులు వ్యాపిస్తాయి. గ్రామాభివృద్ధి అంటే కేవలం సిమెంట్ రోడ్లు కాదు; అది గ్రామ ప్రజల జీవన ప్రమాణాలకు సంబంధించిన అంశం.

ప్రజల పన్నులతో ఏర్పడిన ప్రభుత్వాలు, ప్రజలకు అత్యంత దగ్గరలో ఉన్న గ్రామస్థాయి పాలనను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం? పార్లమెంట్, అసెంబ్లీలకు నిధులు ఉంటే, ప్రజలకు మొదటి ప్రభుత్వంగా ఉండే పంచాయతీలకు ఎందుకు ఉండకూడదు? ప్రతి గ్రామానికి అభివృద్ధి హక్కు ఉంది. అది ప్రభుత్వాల దయాదాక్షిణ్యంపై ఆధారపడే అంశం కాదు. నేడు అవసరమైంది కొత్త పథకాలు కాదు.. ఉన్న వ్యవస్థను బలోపేతం చేయడం. పంచాయతీలకు రావాల్సిన నిధులను చట్టబద్ధ గడువులో విడుదల చేసే విధానం అవసరం. రాష్ట్ర ఆర్థిక సంఘాల సిఫార్సులను అమలు చేయాలి. స్థానిక పన్నుల వసూళ్లను బలోపేతం చేయాలి. గ్రామాల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక విధానాలు రూపొందించాలి. డిజిటల్ పారదర్శకత ద్వారా ప్రతి రూపాయి ప్రజల ముందుకు తీసుకురావాలి. నిధుల విడుదలలో రాజకీయ వివక్షకు తావులేకుండా చూడాలి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నిందలు మోపుకోవడం మానేయాలి. గ్రామాలకు నిధులు ఇవ్వాల్సిన బాధ్యత ఎవరిదైతే వారిదే. ప్రజలకు చివరకు అవసరమయ్యేది రాజకీయ వాదనలు కాదు.. శుభ్రమైన గ్రామం, మంచినీరు, వెలిగే వీధిదీపం, నడవదగిన రహదారి. ప్రజల అవసరాల కంటే రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తే, అది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది.

ప్రజాస్వామ్యం ఢిల్లీలో మాత్రమే ఉండదు. రాష్ట్ర రాజధానుల్లో మాత్రమే ఉండదు. అది ప్రతి గ్రామంలో కనిపించాలి. గ్రామపంచాయతీ కార్యాలయం బలహీనపడితే ప్రజాస్వామ్యపు మొదటి మెట్టు బలహీనపడినట్లే. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే రాష్ట్రం బలంగా ఉంటుంది. రాష్ట్రం బలంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుంది. గ్రామాల్లో నిధుల కొరత కేవలం ఆర్థిక సమస్యగా చూడరాదు. అది సామాజిక న్యాయం, సమానాభివృద్ధి, రాజ్యాంగబద్ధ వికేంద్రీకరణ, ప్రజాస్వామ్య బలోపేతానికి సంబంధించిన అంశం. గ్రామాలను నిర్లక్ష్యం చేస్తూ నగరాల అభివృద్ధి మాత్రమే దేశాన్ని ముందుకు తీసుకెళ్తుందనుకోవడం తీవ్రమైన పొరపాటు. ఎందుకంటే నగరాల ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు, శ్రామిక శక్తికి మూలం గ్రామాలే. ప్రభుత్వాలు ఇకనైనా ప్రచార రాజకీయాలకు బదులుగా పాలనా బాధ్యతను గుర్తించాలి. గ్రామపంచాయతీలను నిధుల కోసం ఎదురు చూసే యాచక సంస్థలుగా కాకుండా, అభివృద్ధిని నడిపించే స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించాలి. పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలి. స్థిరమైన ఆర్థిక వ్యవస్థను కల్పించాలి. గ్రామస్థాయి అధికార వికేంద్రీకరణను నిజంగా అమలు చేయాలి.



వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.